

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వరదనీటి సమస్య తలెత్తకుండా చర్యలు : సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా బస్తీలు, లోతట్టు ప్రాంతాల్లో వరదనీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టడం జరుగుతోందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. వరదనీటి సమస్యపై నాగోల్ డివిజన్ సౌత్‌ఎండ్ పార్క్‌కాలనీ కమ్యూనిటీ హాలులో పరిసర కాలనీ అసోసియేషన్ల సభ్యులు, సంబంధిత అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా భూగర్భ డ్రైనేజీ, వరదనీటి నాలా వ్యవస్థలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడెక్కడైతే పురాతన వరద నాలా, బాక్స్‌డ్రైన్లు ఉన్నాయో వాటిని తొలగించి వాటి చోట కొత్తవి వేయిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు అనంతుల రాజారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, నాయకులు రాంబాబు, భాస్కర్‌యాదవ్, కాలనీల సభ్యులు రవికుమార్, రమేష్, అజయ్, కిశోర్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

బోనాల పండుగకు పారిశుధ్య స్పెషల్ డ్రైవ్

చాదర్‌ఘాట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని బోనాల ఉత్సవాలను నిర్వహించే అమ్మవారి ఆలయాల వద్ద పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న అమ్మవారి ఆలయాల వద్ద వచ్చే ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్న సందర్భంగా బుధవారం నిర్వహించిన పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ జవాన్ రాజు, ఎస్ఎఫ్ఏ శ్రీనివాస్, గణేష్, సుభాష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి: నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం : అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ హైకోర్టు కాలనీలో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి బుధవారం పరిశీలించారు. తాగునీటి పైప్‌లైన్ పనులను నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలి: లచ్చిరెడ్డి

వనస్థలిపురం : పరిసరాల పరిశుభ్రతకు కాలనీవాసులు కృషి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీపురం కాలనీలో కార్పొరేటర్ పాదయాత్ర నిర్వహించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు కాలనీలో పేరుకపోయిన చెత్తకుప్పలు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలి

చంపాపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అధికారులను కోరారు. చంపాపేట డివిజన్‌లోని ఉదయ్‌నగర్‌కాలనీ, మాధవనగర్‌కాలనీల్లో జీహెచ్ఎంసీ నిధులు రూ2కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ సురేష్, మాధవనగర్‌కాలనీ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, ఆయా కాలనీల ప్రతినిధులు అనసూయ, మణిపాల్‌రెడ్డి, రజిత పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల వద్ద పనుల పరిశీలన

సైదాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని సైదాబాద్ డివిజన్‌లోని అమ్మవారి ఆలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్నతో కలిసి బుధవారం పరిశీలించారు. పూసలబస్తీలో అమ్మవారి ఆలయం వద్ద ప్యాచ్‌వర్క్, నూతన టైల్స్ ఫ్లోరింగ్, మూడుగుళ్ల వద్ద విద్యుత్ దీపాల ఏర్పాట్ల పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో బస్తీవాసులు శర్మ, మధు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

కొత్తపేట : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని లక్ష్య సాధనకు పునాది వేసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. బుధవారం కొత్తపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు బుక్కుల పంపిణీ కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకర్, కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోతున్న వారికి అండగా నిలుస్తా: శ్రీవాణి

ఎల్బీనగర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సీఎం రోడ్డు వంద అడుగుల విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న వారికి న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తానని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ భరోసా ఇచ్చారు. సరూర్‌నగర్ సీఎం రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోనున్న వారితో బుధవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాధితులు ఆమెకు తమ డిమాండ్లను వివరించారు. తమకు నష్టపరిహారంలో భాగంగా టీడీఆర్ బదులు ప్రభుత్వం నిర్ణయించే విలువకు మూడు రెట్లు నగదు చెల్లించాలని కోరారు. ఆకుల శ్రీవాణిఅంజన్ స్పందిస్తూ స్థలాలు కోల్పోయే వారికి అన్యాయం జరుగనివ్వమని స్పష్టం చేశారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి : నర్సింహారెడ్డి

మన్సూరాబాద్ : మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా కృషి చేస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధి హయత్‌నగర్‌లోని లెక్చరర్స్‌కాలనీలో విద్యుత్ సమస్య తలెత్తగా బుధవారం ఏఈ ఖాద్రి ఆధ్వర్యంలో త్రిఫేజ్ లోడ్ హెచ్చుతగ్గులను సమాంతరంగా విభజించి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, ఆగమయ్యానగర్‌కాలనీ అధ్యక్షుడు యాదయ్య, శ్రీరాములు, ఆంజనేయులు, వసుధ, లైన్‌మెన్ యాదయ్య, బలరాం పాల్గొన్నారు.

కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

కొత్తపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్ -2 కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం బుధవారం ఏర్పాటయింది. సంఘం నూతన అధ్యక్షుడిగా వలిగొండ కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కొప్పుల మహేష్ కార్యవర్గ సభ్యులుగా గురువారెడ్డి, గండు మల్లేష్, నానియాదవ్, సైదులుగౌడ్, కే. భిక్షపతి, అశోక్, సోను తదితరులు వ్యవహరించనున్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మామిడి రాంచందర్ వారిని అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి : టీటీఐ ఇన్‌స్పెక్టర్

కొత్తపేట: వాహనాలు నడిపే ముందు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి సూచించారు. బుధవారం మన్సూరాబాద్ జడ్పీహెచ్ఎస్ నుండి 48మంది విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ ట్రెయినింగ్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో టీటీఐ అధికారులు రోడ్డుభద్రత, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులు నిబంధనలను తప్పక పాటించాలని, ఉల్లంఘించరాదని ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీటీఐ సిబ్బంది రమేష్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు తప్పకుండా తీసుకోవాలి



ట్రేడ్ లైసెన్సులపై తనిఖీ చేపడుతున్న డీసీ వంశీకృష్ణ

మన్సూరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వ్యాపార సముదాయాల దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్‌లను తప్పనిసరిగా తీసుకోవాలని జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.వంశీకృష్ణ పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని నాగోల్, మన్సూరాబాద్ డివిజన్ల పరిధిలోని వ్యాపార సముదాయాలు, దుకాణాల్లో ట్రేడ్ లైసెన్స్‌లపై అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లతో బుధవారం డీసీ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దుకాణాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

అన్యాక్రాంతమైన పార్కు స్థలాలను స్వాధీనం చేసుకోవాలి

- వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి
- బీజేపీ నేత శ్రీరాములుయాదవ్ డిమాండ్



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

సరూర్‌నగర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో కబ్జాదారుల ధన దాహానికి అన్యాక్రాంతమైన పార్కు స్థలాలను వెంటనే స్వాధీనం చేసుకుని వాటి పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అధికారులను డిమాండ్ చేశారు. పార్కు స్థలాల కబ్జా, మునిసిపల్ కార్యాలయంలో పెరిగిపోతున్న అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. అనంతరం శ్రీరాములుయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పోటీలు పడి పార్కు స్థలాలను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు సైతం వారికి తొత్తులుగా మారి కబ్జాలను అడ్డుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. అధికారులు, అధికార పార్టీ నాయకులు కలిసి కార్పొరేషన్‌ను అవినీతిమయం చేశారని ఆయన విమర్శించారు. కబ్జాకు గురైన అన్ని పార్కు స్థలాలను వెంటనే స్వాధీనం చేసుకుని, వాటి పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అందెల డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. బీజేపీ బడంగ్‌పేట్ శాఖ-1,2 అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ ఎల్మేటి దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి, పాపయ్యగౌడ్, నడికుడ యాదగిరి, మిద్దె సుదర్శన్‌రెడ్డి, తర్రె మల్లేశ్‌యాదవ్, ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, మద్ది రాజశేఖర్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కౌన్సిల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్, మాజీ కార్పొరేటర్లు సునీతాశ్రీకాంత్‌గౌడ్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- బడంగ్‌పేట్ కమినర్ సరస్వతి



ఉత్పత్తులను పరిశీలిస్తున్న కమిషనర్ సరస్వతి

సరూర్‌నగర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని బడంగ్‌పేట్ మునిసిపల్ కమిషనర్ పి.సరస్వతి సూచించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తులతో కూడిన ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్ని స్టాల్స్‌ను సందర్శించి వారి ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం సరస్వతి మాట్లాడుతూ మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలుగుతారని, మహిళా సంఘాల ద్వారా తాము ఉపాధి పొందుతూ ఇతర మహిళలకు సైతం ఉపాధి కల్పించగలుగుతున్నారని అన్నారు.

మ్యాన్‌హోల్ క్లీనింగ్ మెషిన్ ప్రారంభం

బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో మ్యాన్ హోళ్లను శుభ్రం చేయడానికి గాను కొత్తగా కొనుగోలు చేసిన ట్రైపాడ్ మెషిన్‌ను బుధవారం కమిషనర్ సరస్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కొత్త మెషిన్ వల్ల పారిశుధ్య సిబ్బందిపై పని భారం తగ్గడమే కాకుండా వారి ఆరోగ్యం సైతం దెబ్బతినకుండా ఉంటుందని అన్నారు. మ్యాన్‌హోళ్ల క్లీనింగ్ ప్రక్రియ సైతం తొందరగా పూర్తవుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ జాన్‌కృపాకర్, మేనేజర్ బి.నాగేశ్వర్‌రావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, శంకర్, ఈఈ మౌనిక, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో సీఎం సహాయనిధిలో గోల్‌మాల్

- మాజీ మేయర్ పారిజాతారెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి చెక్కుల మంజూరులో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గోల్‌మాల్ జరిగిందని, పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకోవడంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తున్నదని బడంగ్‌పేట్ మాజీ మేయర్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌కు చెందిన పలువురు ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చేరి వైద్యం చేయించుకున్నారు. కాగా వారు సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా నలుగురికి రూ.60వేలు చొప్పున, ఒకరికి రూ.38 వేలు మంజూరయ్యాయి. సదరు మొత్తానికి సంబంధించిన చెక్కులను బుధవారం బాలాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిజాతారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ కౌన్సిల్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు చిగిరింత దయాసాగర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బద్దం రాముగౌడ్, రమేశ్‌గౌడ్, నీరుడి శ్రీరాములు, ఉమేశ్, నయనాచారి, గిరిముదిరాజ్, మసూద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

కొత్తపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో బుధవారం సాయంత్రం ఓ వ్యక్తి అనారోగ్యంతో, అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలికి చెందిన కొత్తపల్లి గణేష్‌కుమార్(62) 20 సంవత్సరాల క్రితం నగరానికి వచ్చాడు. అతడు ఒంటరిగా మన్సూరాబాద్ వాంబే కాలనీ వద్ద అద్దె గదిలో ఉంటూ ఓ ఫంక్షన్‌హాల్‌లో లేబర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం అతడు డబుల్ బెడ్రూమ్ అపార్టుమెంట్ల వద్ద హేర్‌కటింగ్ కోసం వచ్చాడు. అతడు తీవ్రంగా ఆయాస పడుతూ కూలబడి ప్రాణాలు విడిచాడు. సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

వనస్థలిపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని సకాలంలో పోలీసులు కాపాడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జడ్జెస్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి డెకరేషన్ విధులు నిర్వహిస్తు భార్య, ఇద్దరు పిల్లతో కలిసి అద్దె నివాసంలో జీవనం సాగిస్తున్నారు. కాగా బుధవారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు మన్సూరాబాద్‌లోని జడ్జెస్‌కాలనీలో నివాసంలోని తమ ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నాడని సదరు వ్యక్తి భార్య 100 నంబర్‌కు ఫోన్ చేసింది. కాగా మన్సూరాబాద్ ఏరియాలో గస్తీ కాస్తున్న కానిస్టేబుల్ వెంకటరమణ, హోంగార్డు గోపాల్‌లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని సురక్షితంగా కాపాడి అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎన్‌సీఎంఐసీహెచ్‌కు 800 ఆయుర్వేద గ్రంథాల విరాళం



పుస్తకాలను సేకరిస్తున్న ఎన్‌సీఎంఐసీహెచ్ అధికారులు

సైదాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారంలోని నేషనల్ ఇనిస్టూట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్(ఎన్‌సీఎంఐసీహెచ్) సంస్థ గ్రంథాలయానికి బుధవారం దమ్మాయిగూడకు చెందిన వెంపటి రాధాకృష్ణ సేకరించిన 800పైగా ఆయుర్వేద గ్రంథాలను విరాళంగా ఇచ్చారు. బుధవారం దమ్మాయిగూడ గాయత్రీనగర్‌లోని వెంపటి రాధాకృష్ణ నివాసం నుంచి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జీ.పి.ప్రసాద్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ సుభాష్ ఆధ్వర్యంలో పుస్తకాలు సేకరించారు. ఈయుర్వేదం, ఆధునిక వైద్యం, ప్రకృతి చికిత్స వంటి వివధ విషయాలపై ఆధారపడిన గ్రంథాలు ఉన్నాయి. ఈ పుస్తకాలు తెలుగు, హిందీ, ఇంగ్లిషు, సంస్కృత భాషల్లో ఉన్నాయి. తన తండ్రి ఆయుర్వేద ప్రసిద్ధ వైద్యుడు, పుస్తక సేకరణ కర్త డాక్టర్ శాస్త్రి స్మృతిని గౌరవించడమే కాకుండా, భవిష్యత్ తరాల కోసం విరాళం ఇవ్వడం జరిగిందని దాత వెంపటి రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ పరిశోధన అధికారి డాక్టర్ సాకేత్‌రామ్, లైబ్రేరియన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో ప్లాట్ల కబ్జా

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 144లో తన రెండు ప్లాట్లను కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్లాట్ల యజమాని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన పోలాకి సూర్యనారాయణ గత కొన్ని ఏళ్ల క్రితం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సర్వే నంబర్ 144లో 467, 468 రెండు ప్లాట్లను కొనుగోలు చేశాడు. ఆ ప్లాట్ల కేర్‌టేకర్‌గా జూటిక బాబురావును నియమించుకున్నాడు. అతడు అప్పుడప్పుడు వచ్చి ప్లాట్లను చూసి వెళ్తుండేది. కాగా ఈ నెల 7వ తేదీన బాబురావు ప్లాట్ల వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడ నారం బాబు, నారం శంకర్, నారం వెంకటేష్‌తో పాటు మరికొంత మంది ప్లాట్లను కబ్జా చేసి అందులో నిర్మాణం చేస్తుండడంతో బాబురావు వారిని అడ్డుకున్నాడు. దాంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఈనెల 11న మరోసారి బాబురావు ప్లాట్ల వద్దకు వెళ్లగా అప్పటికే అక్కడ బాబు, శంకర్‌తో పాటు పలువురు బూతులు తిడుతూ అతడిని అక్కడి నుంచి నెట్టివేశారు. వారి బెదిరింపులతో భయపడిన బాబురావు అక్కడి నుంచి నేరుగా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వారిపై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు 329, 324, 351 సెక్షల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రెండు పార్టీలకు డాక్యుమెంట్‌లు ఉండడంతో లీగల్ ఒపీనియన్ మేరకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

న్యూ మారుతీనగర్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించండి

కొత్తపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధి న్యూ మారుతీనగర్ సహా పరిసర సత్యానగర్, చైతన్యపురికాలనీల ప్రజలు అమీర్‌పేట తదితర ప్రాంతాలకు వెళ్లడానికి వీలుగా ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కాలనీ అధ్యక్షుడు నీరంకి రవి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన దిల్‌సుఖ్‌నగర్ డిపో అసిస్టెంట్ మేనేజర్ పావనికి, బండ్లగూడ డిపో మేనేజర్ టీ.వెంకటేశంకు వినతిపత్రం అందజేశారు. ఇదివరకు అందుబాటులో ఉన్న బస్సు సౌకర్యాన్ని 15రోజుల క్రితం ఆపేశారన్నారు. తిరిగి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రభాకర్, విశ్రాంత ఎంఆర్‌ఓ మదన్‌మోహన్, శంకర్, ఆషిస్ తదితరులు పాల్గొన్నారు.

సాయినగర్‌కాలనీ గుడిసెల్లో చందు రాథోడ్ పార్థీవదేహానికి ఘన నివాళి

మన్సూరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర సమితి నాయకుడు కేతావత్ చందు రాథోడ్ మృతితో నాగోల్ డివిజన్ సాయినగర్‌కాలనీ గుడిసెల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మూసారాంబాగ్ శాలివాహనపార్కులో మంగళవారం ఉదయం చందు రాథోడ్‌పై కాల్పులు జరిపి హత్య చేసిన ఘటనను తెలుసుకున్న సాయినగర్ గుడిసెవాసులు మా ధైర్యాన్ని కోల్పోయామన్న దిగ్భ్రాంతికి లోనయ్యారు. గుడిసెలు వేసినప్పటి నుంచి తమకు ఎలాంటి సమస్య తలెత్తినా అండగా నేనున్నానంటూ ముందుండి పోరాడి తమకు ధైర్యాన్నిస్తూ సమస్యలు పరిష్కరించే వాడని, అలాంటి నాయకుడిని కోల్పోవడం తమకు తీరనిలోటని గుడిసెవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గుడిసెవాసుల కోసం అనునిత్యం వెన్నంటి ఉండడం పట్ల వారి కోరిక మేరకు మంగళవారం అర్ధరాత్రి గుడిసెల వద్ద ఉంచిన ఆయన పార్థీవదేహాన్ని గుడిసెవాసులతో పాటు సీపీఐ, సీపీఐ అనుబంధ సంస్థలు సందర్శించి పూలమాలలు వేసి పెద్ద ఎత్తున నినాదాలతో నివాళులర్పించారు. అనంతరం బుధవారం అంత్యక్రియల నిమిత్తం ఆయన పార్థీవదేహాన్ని స్వస్థలానికి తరలించారు. పార్థీవదేహాన్ని సందర్శించిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు ఈటీ నర్సింహ, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, సీపీఐ ముషీరాబాద్ కార్యదర్శి చెట్టుకింద శ్రీనివాస్, గుడిసెవాసులు ఉన్నారు.



సాయినగర్ గుడిసెల వద్ద ఉంచిన కేతావత్ చందూ రాథోడ్ పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, గుడిసెవాసులు

మూసారాంబాగ్ ఎస్‌బీహెచ్‌కాలనీ క్రీడా మైదానంలో..

చాదర్‌ఘాట్ : సీపీఐ నేత చందు నాయక్ చిత్రపటానికి దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ బుధవారం ఘనంగా నివాళులర్పించింది. మూసారాంబాగ్ ఎస్‌బీహెచ్ కాలనీ క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ చైర్మన్ సామ ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడు గంగుల వెంకటేశ్వర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామిగౌడ్, ఉపాధ్యక్షుడు ఎంఎస్‌రావు వెంకన్న, ప్రధాన కార్యదర్శి సింగిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్‌గౌడ్, దేవిడి శ్రీనివాస్‌రెడ్డి, విజయ్ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

మైనార్టీలకు అండగా కాంగ్రెస్ : ఎమ్మెల్యే మల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మైనార్టీలకు ఎల్లప్పుడు కాంగ్రెస్ అండగా ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్‌లో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ల పంపిణీకి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని 203 మంది మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేయడమే కాకుండా వారికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో మొత్తం 750 దరఖాస్తులు రాగా ప్రస్తుతం 203 మందికి మాత్రమే మిషన్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



రామచందర్‌రావును సన్మానిస్తున్న న్యాయవాదులు

విద్యావేత్తలు రాజకీయాల్లోకి రావాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యావేత్తలు రాజకీయాల్లోకి వచ్చి రాజకీయాల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతో ఉన్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావును రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తి ద్వారానే కాకుండా రాజకీయాల ద్వారా కూడా ప్రజలకు సేవ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి బాసెట్టి కార్తీక్, మహిళా ప్రతినిధి అనసూయ, బార్ కౌన్సిల్ సభ్యుడు అనంతసేనారెడ్డి, మాజీ అధ్యక్షులు శ్రీనాథ్, మట్టపల్లి శ్రీనివాస్, రాజిరెడ్డి, గుర్రం సుధాకర్‌రెడ్డి, ధీకొండ రవీందర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

ఓల్డ్‌మలక్‌పేట : దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సదనాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయంలో ఆ శాఖ డైరెక్టర్ బి.శైలజను కలిసి దివ్యాంగులు వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో శ్రీనివాసులు, అంజయ్య, దనమ్మ, కిషన్ ఉన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.25కోట్లు మంజూరు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.25కోట్ల నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ నియోజకవర్గ బీ-బ్లాక్ అధ్యక్షుడు, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి తెలిపారు. బుధవారం పెద్దఅంబర్‌పేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి కృషితో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, నాయకులు సిద్దంకి కృష్ణారెడ్డి, పసుల రాజేందర్, వడ్డేపల్లి విజయేందర్‌రెడ్డి, గంట శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



వర్షాలు, బోనాలపై జరిగిన ప్రత్యేక సమావేశంలో కార్పొరేటర్లు, అధికారులు

ఎల్బీనగర్ : శాఖల మధ్య సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత శ్రీధర్ సూచించారు. వర్షా కాలం, బోనాల పండుగ నేపథ్యంలో బుధవారం సర్కిల్ కార్యాలయంలో కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాన్సూన్ ఎమర్జెన్సీ పనులను హైడ్రాకు అప్పజెప్పడంతో శాఖల మధ్య సమన్వయంలో నాలాల పూడిక తీయడం, ట్రాఫిక్ మళ్లింపు, వర్షపునీరు సాఫీగా ప్రవహించేలా అడ్డంకులు తొలగించడం, వాటర్‌స్టాగ్నేషన్ పాయింట్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేయడం, పడిపోయిన చెట్లను వెంటనే తొలగించడం వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, పవన్‌కుమార్, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, ఆకుల శ్రీవాణి అంజన్, ఈఈ శ్రీనివాస్, డీఈలు నవీన్‌కుమార్, విజయ్‌కుమార్, ఎలక్ట్రికల్ డీఈ కవిత, శానిటేషన్ డీఈ చందనచౌహాన్, సీఐలు సైదిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, హైడ్రా, అగ్నిమాపకశాఖ, విద్యుత్, జలమండలి, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్ సహకార సంఘానికి అవార్డు

అబ్దుల్లాపూర్‌మెట్ : తుర్కయంజాల్ రైతుసేవా సహకార సంఘానికి ఉత్తమ పర్ఫామెన్స్ అవార్డు దక్కింది. నాబార్డు 44వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని నాబార్డు తెలంగాణ రీజినల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సహకార, జౌళీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నాబార్డు సీజీఎం ఉదయభాస్కర్ చేతుల మీదుగా సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో టీజీసీఏబీ చైర్మన్ రవీందర్‌రావు, ఆర్‌సీఎస్ సురేంద్రమోహన్ పాల్గొన్నారు.

కట్టమైసమ్మ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపాలి

అబ్దుల్లాపూర్‌మెట్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ కట్ట మైసమ్మ గుడి వద్ద ఆర్టీసీ బస్సు లు ఆపాలని కోరుతూ సీపీఎం సుందరయ్యనగర్‌కాలనీ నాయకులు బుధవారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ 22, 23, 24వార్డు పరిధిలోని సుందరయ్యనగర్‌కాలనీ, లక్ష్మీనగర్, ఇందిరమ్మకాలనీ, ఆపిల్ రెవెన్యూ, బొక్క నారాయణరెడ్డికాలనీ, సాయిప్రియకాలనీలు తుర్కయంజాల్ చెరువు కట్టకింద ఉన్నాయని తెలిపారు. వారందరు నగరానికి వచ్చేందుకు కట్ట మైసమ్మ గుడి వద్దనే బస్సు ఎక్కాల్సి ఉంటుందన్నారు. అయితే గత కొద్ది నెలలుగా అక్కడ ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని దాంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని డీఎంకు తెలిపారు. ఎలాగైనా అక్కడ బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సత్యనారాయణ, శ్రీనివాసులు, కృష్ణ, శంకరయ్య, కుమార్, సత్యం, సాయి, నర్సింహ, బాలయ్య పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రాహ్మణులకు ప్రాధాన్యతనివ్వాలి

మన్సూరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రాహ్మణులకు తగిన స్థాయిలో టికెట్లు కేటాయించి ప్రాధాన్యత నివ్వాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు కోరారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలో టీజీబీఎస్ఎస్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. టీజీబీఎస్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు చెన్నూరి లక్ష్మీనర్సింహారావు, కోశాధికారి పూరె ప్రసాదరావు, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి గూడ రాజేశ్వరరావు, రాఘవేందర్, జయరాం పాల్గొన్నారు.